క్లుప్తంగా

కొటేషన్లకు ఆహ్వానం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని తునికి నల్లపోచమ్మ జాతర సందర్భంగా పూల అలంకరణ, లైటింగ్ కోసం కొటేషన్లను ఆహ్వానిస్తున్నామని ఈఓ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూల అలంకరణ, లైటింగ్ కోసం ఆసక్తి కనబరిచే వారు వారంలోగా తునికి నల్లపోచమ్మ ఆలయం వద్ద కొటేషన్లు సమర్పించాలని సూచించారు.

ఎంపీడీఓ సేవలు అభినందనీయం



ఎంపీడీఓ ఆనందమేరిని సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

చిన్నశంకరంపేట(మెదక్): ఎంపీడీఓ ఆనందమేరి సేవలు అభినందనీయమని నార్సింగి ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి ఎంపీపీ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓని వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీలు సత్యనారాయణ, సంతోష, ఎంపీడీఓ చిన్నారెడ్డి, తహసీల్దార్ మన్నన్, ఎంపీఓ నరేశ్, ఏఓ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ రవికుమార్, మాజీ సర్పంచ్‌లు అశోక్, షరీఫ్, సుజాత, మహేశ్వరీ, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పగిలిన మ్యాన్ హోల్స్ పైకప్పులు

నర్సాపూర్: రోడ్డుపై ఉన్న మ్యాన్ హోల్స్ పైకప్పులు పగిలి రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సీఎస్‌ఐ చర్చి ఏరియాలో రోడ్డుపై ఉన్న రెండు మ్యాన్ హోల్స్ పైకప్పులు పగిలాయని కాలనీవాసులు తెలిపారు. అవి పగలడంతో వాహనాల రాకపోకలతో పాటు కాలినడకన వెళ్లే వారు సైతం ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పారు. పగిలిన మ్యాన్ హోల్స్ పైకప్పులు తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలి



ప్రజలతో మాట్లాడుతున్న చైర్మన్, కౌన్సిలర్లు

నర్సాపూర్: వార్డుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం ప్రజాప్రతినిధులు పర్యటించారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ నయిమొద్దీన్, ఐదవ వార్డు కౌన్సిలర్ సురేశ్ పట్టణంలోని ఐదు, ఆరవ వార్డుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ తదితరులు ఉన్నారు.

నేడు కౌడిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని సీఎస్‌ఐ చర్చి కంపౌండ్‌లో నేటి బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాయని చర్చి పాస్టర్ రెవరెండ్ జైపాల్ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎస్‌ఐ వెస్లీ చర్చ్ క్లాక్ టవర్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో యశోద, మెడికేర్ ఆస్పత్రుల నుంచి ప్రత్యేక వైద్య బృందం రానున్నారన్నారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు, అవసరమైన రోగులకు ఉచిత మందులు ఇస్తారన్నారు. కౌడిపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బియ్యం బకాయిలు రూ.47 కోట్లు

నర్సాపూర్‌లో వ్యాపారి ఆస్తులు వేలం



వ్యాపారి ఆస్తులు వేలం వేస్తున్న అధికారులు

నర్సాపూర్ : నర్సాపూర్‌కు చెందిన ఓ వ్యాపారి స్థిర ఆస్తులను వేలం వేసినట్లు తహసీల్దార్ కమలాద్రి తెలిపారు. వేలంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారి శ్రీధర్ గుప్తా ప్రభుత్వానికి రూ.47,17,36,860 విలువ చేసే సీఎంఆర్ బియ్యం చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీన చరాస్తులు వేలం వేయగా రూ.22,96,500 వచ్చాయని తెలిపారు. మంగళవారం ఆయన స్థిర ఆస్తులు ఇల్లు, పలు వ్యవసాయ భూములు వేలం వేయగా రూ.7,49,45,000 వచ్చాయని వివరించారు. వేలం ప్రక్రియలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్‌ఐలు ఫైజల్, సిద్ధి రామ్‌రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు అమోఘం



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లు ఆయాల సేవలు అమోఘమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ప్రజలు అనేక రకాల సేవలు అందిస్తున్నారని వారిని అభినందించారు. వారి సమస్యలు తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ అండగా ఉంటానని చెప్పారు. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ సీడీపీఓ హేమభార్గవి మాట్లాడుతూ.. తన ప్రాజెక్టు పరిధిలో 280 మంది అంగన్‌వాడీ టీచర్లకు, 185 మంది ఆయాలకు దుస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వం ఏటా దుస్తులు అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో చిలప్‌చెడ్ ఎంపీపీ అధ్యక్షురాలు వినోద, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, నర్సింలు, సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, మహ్మద్, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యలో వచ్చి వెనుదిరిగిన ఎంపీపీ

అంగన్‌వాడీ టీచర్లకు ఆయాలకు దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు పాల్గొని ప్రసంగించిన అనంతరం వారికి దుస్తుల పంపిణీ ప్రారంభించారు. కాగా స్థానిక ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి, రెడ్డిపల్లి ఎంపీటీసీ ఆంజనేయులుగౌడ్ రైతు వేదిక లోపలికి వచ్చే సరికి దుస్తులు పంపిణీ కొనసాగుతున్నందున వారు లోపలికి వచ్చి అలా బయటకు వెళ్లిపోయారు.

వైభవంగా పెద్దమ్మ కల్యాణోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రాంపూర్ గ్రామంలో కొలువైన పెద్దమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు రెండు రోజుల నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేడుకలకు హాజరైన రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకులు నీలం మధు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అలాగే అమ్మవారి కల్యాణోత్సవానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, గ్రామ ముద్ర సంఘం కార్యవర్గం సభ్యులు,నాయకులు ఉన్నారు.



అమ్మవారి సన్నిధిలో రాజిరెడ్డి

కనులపండువగా బోనాల ఊరేగింపు



పాపన్నపేట(మెదక్): బోనాల ఊరేగింపు



నార్సింగిలో అమ్మవారిని దర్శించుకుంటున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో మంగళవారం గౌడ సంఘం సభ్యులు రేణుకా ఎల్లమ్మకు ఘనంగా బోనాలు తీశారు. కార్యక్రమంలో మైనంపల్లి హన్మంత్‌రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం గౌడ సంఘం సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలను గ్రామం నుంచి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సమర్పించారు.

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కల్యాణోత్సవంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు ఓడి బియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సుజాత, పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌గౌడ్, అశోక్‌గుప్తా, రాజాగౌడ్, పండరిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్‌గౌడ్, సిద్ధిరాములుగౌడ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నివారణ చర్యలతో పంటలు భద్రం



బండపోతుగల్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి, రైతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన నివారణ చర్యలు పాటిస్తే పంటలు భద్రంగా ఉండడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పంట వివరాల నమోదు చేయడంతో పాటు వరిసాగును పరిశీలించారు. అనంతరం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, ఎరువులు, స్టాక్ పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి ఉన్న ఎరువులు, విత్తనాలు మాత్రమే అమ్మాలని, నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆగ్రో రైతు సేవా కేంద్రం యజమాని శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

మా భూముల పొజిషన్ చూపండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

శివ్వంపేట(నర్సాపూర్): సాగు కోసం రైతులకు ఇచ్చిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయిందని పొజిషన్ చూపించాలని రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన 26 మంది రైతులకు 1982లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హయంలో భూ పట్టాలు ఇచ్చారని తెలిపారు. గ్రామ పరిధిలో సర్వే నంబర్ 293, 294, 295, 296, 297లో 50 ఎకరాల 27 గుంటల భూమిని 26 మంది రైతులకు పంపిణీ చేశారని చెప్పారు. ప్రభుత్వం మాకు కేటాయించిన భూమిని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించి ప్రహరీ నిర్మించి వెంచర్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. వెంచర్ ఏర్పాటు పనులు అడ్డుకున్నప్పటికీ సర్వే చేసి మా భూముల హద్దులు చూపిస్తామని చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

భూములు అక్రమించి వెంచర్ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రహ్లాద్ డిమాండ్ చేశారు. అనంతరం రైతులు తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి వినతిపత్రం అందజేశారు. రైతులు అశోక్, కృష్ణ, సలీం, శ్రీనివాస్, నర్సింలు, మల్లేశ్, యాదగౌడ్, భిక్షపతి, బాల్‌రాజ్, సాయిలు, రాజయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నర్సాపూర్: జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా మంగళవారం డిమాండ్ చేశారు. సిద్దిపేట మండలంలోని బక్రీ చెప్యాల గ్రామంలోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. జాతీయ నేతల విగ్రహాలను ధ్వంసం చేసే దుండగులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నర్సాపూర్: పట్టణంలో బుధవారం ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీ, వైష్ణవి జూనియర్ కళాశాల, ఎల్లంకి జూనియర్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

వెల్దుర్తి(తూప్రాన్): ఇంటర్మీడియట్ బోర్డ్ ఆదేశాల మేరకు పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని శ్రీరాయరావు సరస్వతి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో 117 మంది, ద్వితీయ సంవత్సరంలో 89 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటల లోపు విద్యార్థులు పరీక్షాహాల్‌కు తప్పనిసరిగా చేరుకోవాలన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ అవనీష్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని రావొద్దని సూచించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కౌడిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామారావు తెలిపారు. మంగళవారం కౌడిపల్లిలో ఇంటర్ పరీక్షల ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌడిపల్లి జూనియర్ కళాశాలతో పాటు, గురుకుల కళాశాల, తునికిలోని ఎంజేపీ చెందిన మొత్తం 678 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 388 మంది, ద్వితీయ సంవత్సరంలో 290 మంది విద్యార్థుల పరీక్షలు రాయనున్నారన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



రామాయంపేట(మెదక్): పతకాలు, ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థినులు

రామాయంపేట(మెదక్): వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీలో స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలను గెల్చుకున్నారు. పోటీలో పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, ఓవరాల్ చాంపియన్ షిప్ రామాయంపేటకు దక్కిందని గ్రాండ్ మాస్టర్ హరిప్రసాద్, బ్లాక్ బెల్ట్ ప్రధాత నాగరాజు తెలిపారు. ఈ మేరకు ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు పతకాలతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు సన్మానించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు సోమకృష్ణ, హరిసింగ్, నాగరాజు అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సాపూర్ పట్టణంలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో చిలప్‌చెడ్ మండలంలోని గౌతాపూర్, చిట్కుల్, చండూర్ గ్రామాల ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, బంగారు, వెండి, కాంస్య పథకాలు సాధించారన్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): పథకాలు, సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

‘ఉజ్వల’తో మహిళలకు ప్రయోజనం



లబ్ధిదారులకు గ్యాస్ స్టౌ అందిస్తున్న మురళీయాదవ్, నాయకులు

నర్సాపూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంతో పేద మహిళలకు లాభం చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ చెప్పారు. పథకం కింద మంగళవారం పలువురు మహిళలకు గ్యాస్ కనెక్షన్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల కోసం పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కనెక్షన్‌లో భాగంగా గ్యాస్ స్టౌ, గ్యాస్ సిలిండర్, రెగ్యులేటర్, పైప్ ఉచితంగా అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, పార్టీ నాయకులు ఆంజనేయులుగౌడ్, నగేశ్, వంట గ్యాస్ డీలరు ప్రశాంత్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



చిలప్‌చెడ్(నర్సాపూర్): అంతారం పాఠశాలలో..



యూసుఫ్‌పేటలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అంతారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా కార్తీక్, సాయి, చరణ్, విశాల్, సమీనా, హరిణి, స్పందన, ప్రవళిక వ్యవహరించారు.

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపల్లి, యూసుఫ్‌పేట, అన్నారం పాఠశాలల్లో మంగళవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎంలు, టీచర్లు పర్యవేక్షించారు.



రేగోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ..

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన జరుపుకొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ హరికృష్ణ అన్నారు. మంగళవారం నేషనల్ ఎన్‌జీఓ డే సందర్భంగా సెగల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల సిబ్బంది, రైతులతో అవగాహన సదస్సు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సెగల్ స్వచ్ఛంద సంస్థ మండలంలోని పలు గ్రామాలను దత్తత తీసుకొని చెరువులు, కుంటలు, అభివృద్ధి చేయడం, రైతులకు ఉచితంగా వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు ఇవ్వడం, సోలార్ లైట్ల ఏర్పాటు చేయడం పై సంతోషం వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థ సౌత్ ఇండియన్ ఇన్‌చార్జి సురిచిసింగ్ మాట్లాడుతూ.. శివ్వంపేట మండలంలో ఎదుల్లాపూర్, చిన్నగొట్టిముక్ల, పిల్లుట్ల, చెన్నాపూర్, లింగోజిగూడ, రత్నాపూర్ గ్రామాలను దత్తత తీసుకొని రైతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సంస్థ అడ్మిన్ మేనేజర్ బాల్‌రాజ్, నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

సంక్షిప్త వార్తలు

◆ **సొంత డబ్బులతో బోరుబావి తవ్వకం**

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో మల్లన్న ఆలయం వద్ద కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తన సొంత డబ్బులతో మంగళవారం బోరు బావి తవ్వకం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు భాస్కర్, స్టాలిన్‌నర్సింలు, స్వామి, పోచయ్య, భిక్షపతి, రాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పరీక్షలకు సన్నద్ధం కావాలి**

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి వార్షిక పరీక్షలకు ప్రతీ విద్యార్థి సన్నద్ధం కావాలని కస్తూర్బా ప్రత్యేక అధికారి కృష్ణతేజ అన్నారు. మంగళవారం మండలంలోని కూచారం గ్రామ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న పదో తరగతి, ఇతర విద్యార్థులకు జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధి శ్రీనివాస్ పరీక్షా ప్యాడ్, స్టేషనరీ వస్తువులను అందజేశారు.

◆ **ఊపిరి ఉన్నంత వరకు సేవ చేస్తా**

చిన్నశంకరంపేట(మెదక్): ఊపిరి ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల ముగింపులో ఆయన హాజరయ్యారు. ఐదేళ్లుగా సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ అధ్యక్షుడు, ఓయూ జేఏసీ నాయకుడు మోహన్‌నాయక్‌ను అభినందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, రాజిరెడ్డి, శ్రీమన్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, నరేందర్, రాజాసింగ్, మంగ్యానాయక్, సిద్ధిరాములు, మనోజ్, జనార్దన్, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

◆ **నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడిగా జహీరుద్దీన్**

రామాయంపేట(మెదక్): మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా రామాయంపేటకు చెందిన జహీరుద్దీన్ నియమితులయ్యారు. ఈమేరకు సేవాదళ్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు జితేందర్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన ఎంపికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్‌ఎస్ పార్టీని ఖాళీ చేయడమే తమ లక్ష్యమని మైనంపల్లి హన్మంతరావు, నర్సారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శుభం గార్డెన్ ఫంక్షన్ హాల్‌లు బీఆర్‌ఎస్ నాయకులు చేరారు. తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణాగౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు నవీన్‌చారి, శ్రీహరిగౌడ్, నాయకులు నరేన్‌రెడ్డి, రాజు, 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, జావేద్‌పాషా నర్సింగరావు పాల్గొన్నారు.

◆ **దామోదర్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి**



అల్లాదుర్గం(మెదక్): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతోనే అందోల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో రూ.10 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లగా బీఆర్‌ఎస్ పాలనలో అందోల్‌లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. తిరిగి దామోదర్ రాజనర్సింహ విజయం సాధించి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి నియోజకవర్గంలో అభివృద్ధికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు సురేశ్, నర్సింలు, మహేశ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

◆ **విషపు మొక్కలే మేకల మృతికి కారణం**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మల్లన్నగుట్ట సమీపంలో మేతకు వెళ్లిన మేకలు ఒకే రకం విషపు మొక్కలను ఎక్కువగా తినడంతోనే మృత్యువాత పడినట్లు పశువైద్యాధికారి జీవన్ ప్రతాప్ తెలిపారు. మంగళవారం నార్సింగి మల్లన్నగుట్ట ప్రాంతంలో మృతి చెందిన మేకలకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. వల్లభాపూర్‌కు చెందిన మేకల కాపారి సాయిలు న్యాయం కోసం ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

◆ **భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు**

అల్లాదుర్గం(మెదక్): చిల్వెర గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ రెండో వార్షికోత్సవాలు మంగళవారం జరుగుతున్నాయి. అందులో భాగంగా అమ్మవారికి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు.

◆ **లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీకొండాపూర్ సింగరాయగుట్ట లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభించారు.

◆ **విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారం గ్రామంలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామ పురోహితులు అయోధ్యరామశర్మ, శశిధర్‌శర్మ, చండికశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రంగపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లావణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.